రహదారులు అధ్వానం అవస్థల ప్రయాణం

ఆందోళనలో భాస్కర్ నగర్ కాలనీ వాసులు • అడుగడుగునా గోతులే.. • వెలగని వీధి దీపాలతో మరిన్ని ఇబ్బందులు


కుదించుకుపోయిన 60 అడుగుల రహదారి

పీఎం పాలెం: నగర పరిధిలోని జీవీఎంసీ 6వ వార్డులోని భాస్కర్‌నగర్ కాలనీ, బాలాజీ నగర్ లేఅవుట్, సాయిప్రియా గార్డెన్స్ లేఅవుట్ ప్రాంతాల్లోని రహదారులు అత్యంత అధ్వానంగా మారాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారులపై ప్రయాణం అడుగడుగునా ప్రాణ సంకటంగా మారిందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో విష సర్పాల బెడదతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇంటికి చేరుకోవాల్సి వస్తోందని పాదచారులు వాపోతున్నారు.

జాతీయ రహదారి నుంచి భాస్కర్‌నగర్ కాలనీతో పాటు చుట్టుపక్కల కాలనీలకు వెళ్లేందుకు 60 అడుగుల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే సుమారు అర కిలోమీటరు నిర్మించిన తర్వాత పనులు నిలిపివేయడంతో, అంతవరకూ విశాలంగా ఉన్న రోడ్డు ఇరుకుగా మారిపోయింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. రోడ్డు అభివృద్ధి పక్కన పెడితే, కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, ఈ రోడ్డులో ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులోనే శ్రీభాస్కర, పోలాక్ వంటి ప్రైవేటు విద్యాసంస్థలు ఉండటంతో వాహనాల రద్దీ కూడా అధికంగానే ఉంటుంది.


అధ్వానంగా భాస్కర్ నగర్ కాలనీ రహదారి

విషసర్పాల బెడద, చీకట్లో ప్రయాణం

ఈ రోడ్లకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లో తుప్పలు, డొంకలు పేరుకుపోయి అడవిని తలపిస్తున్నాయి. చీకటి పడితే పాములు రోడ్లపైకి వచ్చి బుసలు కొడుతున్నాయని స్థానికులు భయపడుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో కారు చీకట్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు చినుకు పడితే రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోందని చెబుతున్నారు. స్థానికులు వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి, రహదారి, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు



జీవీఎంసీ 6వ వార్డులోని రోడ్లు వర్షం పడితే బురద మయంగా మారి, పాదచారులకు నరకంగా మారాయి. ద్విచక్ర వాహనదారులు గుంతల కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉన్నందున, అధికారులు వెంటనే కనీసం తాత్కాలిక మరమ్మతులనైనా చేపట్టి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలి.

–సంతోష్, భాస్కర్ నగర్


భాస్కర్ నగర్, బాలాజీ నగర్ లే అవుట్ తదితర ప్రాంతాలకు వెళ్లే 60 అడుగుల రహదారి దుస్థితి


గోతుల మయంగా రోడ్డు

వీధి దీపాలు పునరుద్ధరించాలి



రహదారుల వెంట ఉన్న విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతం రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు లేకపోవడం వల్ల పాముల సంచారం పెరిగింది. దీనికితోడు గుంతలమయమైన రోడ్లు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. సంబంధిత వీధి దీపాల నిర్వహణ అధికారులు వెంటనే స్పందించి, రోడ్ల పొడవునా విద్యుత్ దీపాలను పునరుద్ధరించి ఈ సమస్యను పరిష్కరించాలి.

–రావ్, భాస్కర్ నగర్ లేఔట్

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

భగవద్గీతే జగద్గురువు


దుర్గానగర్‌లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న భక్తులు

మధురవాడ: జ్ఞానాన్ని బోధించేవారు గురువులైతే, సర్వస్వాన్ని బోధించే భగవద్గీతను జగద్గురువుగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు అభివర్ణించారు. రానున్న గురుపౌర్ణమి పండగను పురస్కరించుకుని ఆదివారం చంద్రంపాలెం దుర్గానగర్‌లో త్రైత సిద్ధాంత భగవద్గీత, దాని అనుబంధ గ్రంథాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రంథం భగవద్గీత అని, దానికి జీవం అందించింది శ్రీకృష్ణ భగవానుడని అన్నారు. గురుపౌర్ణమి రోజున గొప్ప జ్ఞానాన్ని అందించిన ఆ పరమాత్మునికే పూజ చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ సభ్యులు మహాలక్ష్మి, మంగ, అప్పారావు, అప్పారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారు రథోత్సవం


మారు రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం: భీమిలిలో జరుగుతున్న శ్రీ జగన్నాథస్వామి వారి రథోత్సవ మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన ఆదివారం సాయంత్రం మారు రథోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం శేషశయన అవతారంలో ఉన్న స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు ఆర్. సింగరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథం వద్ద ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దబజారు, మెయిన్ రోడ్డు మీదుగా రథాన్ని ఊరేగించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగారు. ఈ మారు రథోత్సవంతో భీమిలిలో జగన్నాథస్వామి వారి రథయాత్ర మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

శ్రీవారికి విశేష పూజలు


లక్ష తులసి పూజలో పాల్గొన్న భక్తులు

భీమునిపట్నం: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశిని పురస్కరించుకుని భీమిలిలోని వేంకటేశ్వరస్వామివారి ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు ఘనంగా జరిగాయి. కీతిన్‌పేట సమీపంలోని ఐశ్వర్య వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అర్చకులు పురాణం శేషాచార్యుల ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ పూజలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ్, కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి, కె.భానోజీరావు, శ్రీనివాసరావు, వి.బంగారాజు తదితరులు పాల్గొన్నారు. కృష్ణాకాలనీ కొండపై వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలోనూ లక్ష తులసి పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

350 మందికి వైద్య సేవలు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో ఆదివారం ఉమానారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సంగివలసలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రి సిబ్బంది సుమారు 350 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఫౌండేషన్ ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షుడు బమ్మిడి శ్రీతారక్ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రేవళ్లపాలెం 11 కేవీ ఫీడర్‌లు పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని మధురవాడ సబ్ స్టేషన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శైలజ చెప్పారు. ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 12గంట వరకు మధురవాడ మెయిన్ రోడ్డు చంద్రంపాలెం హైస్కూలు ఏరియా, రేవళ్లపాలెం విలేజ్, రేవళ్లపాలెం రోడ్డులోని పీఎం పాలెం పోలీస్‌స్టేషన్, శ్రీవల్లినగర్, ఎమ్ఎస్ఆర్ లే అవుట్ భాస్కర్‌నగర్, నగరంపాలెం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

అష్టలక్ష్మి సన్నిధిలో తొలి ఏకాదశి పూజలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, తోమాల సేవలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణులను తులసి మాలలతో విశేషంగా అలంకరించారు. స్వామి వారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు తన్మయత్వం చెందారు. సాయంత్రం అష్టలక్ష్మీ మహిళా మండలి ఆధ్వర్యంలో విశేష పారాయణలు, భజన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శయన ఏకాదశి పూజలు


తగరపువలస: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వైష్ణవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్థానిక కొండపై వెలసిన శ్రీ రమా సత్యనారాయణస్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకులు ఏడాది వివేకానందశర్మ, కార్తీక్ శర్మల ఆధ్వర్యంలో భక్తులు రమా సత్యనారాయణ వ్రతాలు ఆచరించి, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అలాగే వేంకటేశ్వరమెట్టపై గల శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శయన ఏకాదశి పూజలు విశేషంగా జరిగాయి. పలు రామాలయాలు, షిర్డీ సాయిబాబా ఆలయాలలో కూడా తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు.


తులసి మాలల అలంకరణలో ..


శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి

అనంతుని గిరిపై ..

పద్మనాభం: పద్మనాభంలోని గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి, దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు అనంత పద్మనాభ స్వామి, కుంతీ మాధవ స్వామి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర ప్రాంతాలైన కృష్ణాపురం, మద్ది, పద్మనాభం, రెడ్డిపల్లి నుంచే కాకుండా దూర ప్రాంతాలైన విజయగనరం, తగరపువలస, భీమునిపట్నం, విశాఖపట్నంల తరలి వచ్చిన భక్తులు అనంత పద్మనాభ స్వామి, కుంతీ మాధవ స్వామిలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.


పూజలు చేస్తున్న అర్చకుడు

శ్రీవారి సన్నిధిలో సామూహిక విష్ణుపారాయణం


పారయణం పటిస్తున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అర్చకులు శాస్త్రోక్తంగా తోమాల సేవ, సుప్రభాత సేవలను నిర్వహించారు. అనంతరం భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కల్పించారు. శ్రీవారి భక్తుల ఆధ్వర్యంలో 300 మంది సామూహికంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణాన్ని భక్తి శ్రద్ధలతో పటించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సూపరింటెండెంట్ అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ


ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ నామస్మరణతో సాగరనగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయ్ సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించి, పలు ప్రవచనాలు అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ రకాల రంగుల పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కీర్తనలు ఆలపిస్తూ, స్వామివారి దర్శనం చేసుకుని పునీతులయ్యారు.

పుష్ప విలాపం

వర్షాలకు కుదేలైన పువ్వుల వ్యాపారం

తగరపువలస: భీమిలి డివిజన్‌లోని పూల తోటల్లో పలికే ప్రతి పువ్వులోనూ ఇప్పుడు ఒక రైతు గుండె చప్పుడు వినిపిస్తోంది. ఆ చప్పుడులో ఆశ లేదు, ఆనందం లేదు... కేవలం ఆర్తనాదం, అంతులేని ఆవేదనే. ఇటీవల కురిసిన భారీ వర్షాలు వారి ఆశల సౌధాన్ని నేలమట్టం చేశాయి. అష్టకష్టాలు పడి పండించిన పూలు ఇప్పుడు కన్నీటితో తడిసి, వాడిపోతున్నాయి. అసలే ఇది ఆషాఢమాసం. శుభకార్యాలకు, వేడుకలకు దూరంగా ఉండే సమయం. పూల వ్యాపారానికి 'అన్‌సీజన్'గా పేరుపొందిన ఈ నెలలో, ధరలు అంతంతమాత్రంగానే ఉంటాయి. కిలో బంతి రూ.120, చామంతి రూ.350, డజను గులాబీ రూ.20, మల్లె మూర రూ.35, కనకాంబరాలు మూర రూ.40, 15 మందారాలు రూ.10... ఇవి కేవలం ధరలు మాత్రమే కాదు, రైతు శ్రమకు అద్దం పట్టే అంకెలు. సాధారణంగా సన్మాన సభలు, గృహ ప్రవేశాలు, పెళ్లిళ్లు వంటివి ఉంటే పూలకు మంచి గిరాకీ ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ జాడ లేదు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కష్టపడి మార్కెట్‌కు తరలించిన పూలు వర్షం ధాటికి తడిసి ముద్దయ్యాయి. ఆ బురదలో, ఆ తేమలో ఫంగస్ చేరింది. అందంగా వికసించాల్సినవి వాడిపోయాయి. పూల వాసన గుబాళించాల్సింది పోయి, దుర్వాసనతో నిండిపోయాయి. మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. వారి ముఖాల్లో నిరాశ, కళ్లల్లో నిర్వేదం. గంటల తరబడి, ఆశగా... 'ఎవరైనా కొంటారేమో' అని ఎదురుచూసి, చివరకు ఆశలు చచ్చిపోయి, పండించిన పూలను అక్కడే నేలపాలు చేసి, వెనుదిరుగుతున్న రైతుల దృశ్యం గుండెలను పిండేస్తోంది. వారి శ్రమ, పెట్టుబడి, రేపటిపై పెట్టుకున్న ఆశలన్నీ ఆ బురదలో కలిసిపోతున్నాయి. ఇది కేవలం పూల విలాపం కాదు, పూల రైతు కన్నీటి గాథ. వారి ఆశలు అడియాశలవుతున్న హృదయ విదారక దృశ్యం.


పాడైన చామంతి పువ్వులను ఆనందపురం మార్కెట్లో పారబోసిన వ్యాపారులు

ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

తగరపువలస: చిట్టివలసలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు వివిధ పాఠశాలల నుంచి 8వ తరగతి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం, గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్, ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.శివరాణి, సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, సత్యారావు, ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, బీజేవీ రమణ, వైవీ రమణ, పక్కి నాగేశ్వరరావు, అప్పారావు, శివకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

సీఐటీయూ బైక్ ర్యాలీ

మధురవాడ: ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను పరిరక్షించాలని, ఇతర డిమాండ్లను సాధించాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 9న అఖిల పక్ష కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ స్థాయి సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ ఆదివారం మధురవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు.కొమ్మాది జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మధురవాడ డైలీ మార్కెట్, చంద్రంపాలెం, కార్‌షెడ్, పీఎం పాలెం మీదుగా సాగి తిరిగి కొమ్మాది జంక్షన్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కమిటీ అధ్యక్షుడు డి. అప్పలరాజు , సీఐటీయూ నాయకులు పి. రాజ్‌కుమార్, ఎస్. రాములప్పడు, డి. సూరిబాబు, జి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మధురవాడ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

కీడాకారులకు జెర్సీల పంపిణీ

తగరపువలస: చిట్టివలస పోలమాంబ క్లబ్‌లో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు ఆదివారం టీచర్స్ హెల్ప్ గ్రూప్ తరపున జెర్సీలు, షార్ట్‌లు అందజేశారు.ఈ సందర్భంగా ఫుట్‌బాల్ క్లబ్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు మాట్లాడుతూ, ప్రతిభ గల క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం అందిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు, చీఫ్ కోచ్ బోర చిన్నారెడ్డి, కోల చంద్రశేఖర్, టీచర్స్ హెల్ప్ గ్రూప్ తరపున మరగడ అప్పారావు, సీనియర్ కోచ్ జామి అప్పలకృష్ణ, వెంపాడ శ్రీనివాసరెడ్డి, కంటుబుక్త ముత్యాలరావు, ఎం.సత్యబాపిరాజు, ఎంవీవీఎస్ రెడ్డి, రమాదేవి, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. 2023, 2024 సంవత్సరాలలో జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ఆడిన కె.భాగేష్, ఎ.భరత్‌లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఘనంగా శ్యాంప్రసాద్ జయంతి

పీఎంపాలెం: పీఎం పాలెం ఆఖరు బస్టాపు వద్ద భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కేఎన్‌పీ చక్రవర్తి.. శ్యాంప్రశాద్ ముఖర్జీ జీవిత విశేషాలు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఆరో వార్డు అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, సీహెచ్ నాగరాజు, పెంద్యాల శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కే.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

9న అఖిల భారత పారిశ్రామిక బంద్‌ను జయప్రదం చేయండి

తగరపువలస: ఈ నెల 9న తలపెట్టిన అఖిల భారత పారిశ్రామిక బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి, కార్మిక హక్కులను హరించివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పని భద్రత లేకుండా పోయిందని, పనిగంటలు 10 నుంచి 12 గంటల వరకు పెంచాలని యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయని ఆరోపించారు. దీని వల్ల కార్మికులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్మికులపై పెరుగుతున్న ఈ ఒత్తిడిని పోరాటాల ద్వారా జయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కార్మికులకు అనుకూలంగా మార్చుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల నరసింహులు, మావూరి వీర్రాజు, గిడుతూరి సూరిబాబు, చిల్ల అప్పలసూరి, గోవిందరావు, సన్నిబాబు, చిల్ల రాంపైడి, లక్ష్మణరావు, దుంప శ్రీను, తోటయ్య, అప్పారావు, రాము పాల్గొన్నారు.


గుజ్జు రామునాయుడు భవన్‌లో సమావేశమైన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

వారం రోజులు వ్యాక్సినేషన్


పెంపుడు కుక్కలను వ్యాక్సిన్ వేస్తున్న వైద్యుడు

భీమునిపట్నం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమిలి పశువైద్యశాల వద్ద పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. వి. సునీల్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెంపుడు కుక్కల ఆరోగ్య విషయంలో యజమానులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ప్రతి సంవత్సరం తప్పనిసరిగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. వారం రోజుల పాటు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందని, అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు తప్పనిసరి

మధురవాడ: పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రాబిస్ టీకాలు వేయించాలని చంద్రంపాలెం పశువైద్య కేంద్రం వైద్యాధికారి అనుపమ సూచించారు. ప్రపంచ జూనోటిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పశువైద్య కేంద్రంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 86 పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు వేశారు. డాక్టర్ అనుపమ మాట్లాడుతూ, కుక్క కరవకముందే రక్షణ కోసం, యాంటీ రాబిస్ టీకాలు వేయించుకోవడం అత్యవసరమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జ్యూట్ యాజమాన్యంతో కార్మిక సంఘాలు కుమ్మక్కు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో అక్రమ లాకౌట్‌తో బాధపడుతున్న కార్మికులకు కొందరు కార్మిక నాయకులు ద్రోహం చేశారని అక్రమ లాకౌట్ బాధిత సంఘం తరపున న్యాయవాది ఎన్. జనార్ధనరావు ఆరోపించారు. ఆదివారం భీమిలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మిక సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల హక్కులను కాలరాశాయని విమర్శించారు.2009లో మిల్లు మూసివేత అక్రమ లాకౌట్‌గా ప్రభుత్వం గుర్తించిందని, యాజమాన్యం వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిందని జనార్ధనరావు తెలిపారు. కోర్టు ఆదేశాల ప్రకారం కార్మికులకు 18 నెలల వేతనం చెల్లించాల్సి ఉన్నా, యాజమాన్యం వేసిన రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 2019లో కార్మిక సంఘాలు యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందం చట్ట వ్యతిరేకమని, పీఎఫ్, గ్రాట్యుటీ వంటి బకాయిలలో కోత విధించిందని ఆరోపించారు. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశామన్నారు. 2009-2020 మధ్య కార్మిక సంఘాలకు ఎన్నికలు జరగనందున, ఒప్పందం చేసుకునే అర్హత వారికి లేదని వాదించారు. కార్యక్రమంలో లాకౌట్ బాధిత సంఘం నాయకులు పాల్గొన్నారు.


వివరాలు తెలియచేస్తున్న లాకౌట్ బాధిత సంఘం న్యాయవాది జనార్ధనరావు

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణార్పణం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ, ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద గల శ్రీరాధా మదన మోహన మందిరంలో ఆదివారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణార్పణం' అనే భక్తి పూర్వక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నగరానికి చెందిన కర్ణాటిక్ క్లాసికల్ కన్సర్ట్ కళాకారులు అద్భుతమైన సంగీత ప్రదర్శన ఇచ్చారు. మునూరు శ్రీకాంత్ (గాత్రం), ఇవటూరి కృష్ణశృతి (వయోలిన్), సీహెచ్ చాణక్య చంద్ర (మృదంగం) ఈ సంగీత సేవను సమర్పించారు. వీరు శ్రీకృష్ణ లీలలను పాటల రూపంలో గానం చేసి భక్తులను అలరించారు. కార్యక్రమం అనంతరం కళాకారులను హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస అభినందించారు. ప్రతి ఆదివారం భక్తి కళాకారులు సంగీతం, నృత్యం, ఇతర సాంప్రదాయ కళారూపాలను భక్తిపూర్వకంగా శ్రీకృష్ణునికి సమర్పించడానికి 95425 11108 నంబరులో సంప్రదించాలని అంబరీష దాస తెలిపారు.


సంగీత ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

గంటల్లోనే నిందితుడి అరెస్ట్

మధురవాడ: వైఎస్సార్ కాలనీకి చెందిన ఓ ఒంటరి వృద్ధురాలి మెడలో నుంచి దొంగిలించిన రెండు తులాల బంగారు గొలుసును పీఎంపాలెం పోలీసులు కేవలం గంటల వ్యవధిలోనే రికవరీ చేసి నిందితుడిని అరెస్టు చేశారు. పీఎంపాలెం ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం, జీవీఎంసీ 5వ వార్డు, వైఎస్సార్ కాలనీకి చెందిన 65 ఏళ్ల కొత్తకోట వరలక్ష్మి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు క్రైమ్ సీఐ ప్రకాష్ పర్యవేక్షణలో ఏఎస్ఐ కె. బాబా అమర్, సిబ్బంది మల్లిక్, గణేష్, రమేష్‌లు దర్యాప్తు చేసి, కాపులుప్పాడకు చెందిన జి. ఆదినారాయణ అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.